కథా నిలయం
5081
శ్రీకాకుళం

# చదర

నాలుగు రోడ్ల కూడలి దగ్గర బస్సు ఆగింది. వీరావధాని సూటుకేసు పట్టుకుని బస్సు దిగి చుట్టూ చూశాడు.

అగ్రహారం వీధి వెలవెలబోతూ వుంది. విశాలంగా ఉండే వీధి ఇంత ఇరుకెలా అయిపోయింది?

బారెడు పొద్దెక్కబోతున్నా ఇంకా బద్ధంకంగా ఒళ్ళు విరుచుకుంటున్నట్టుంది ఊరు.

లాగూ, చొక్కా తొడుక్కుని బేడ కాసు పట్టుకుని ఇంటి దగ్గర పరుగు మొదలెడితే నాలుగు రోడ్ల మధ్యకొచ్చేసరికి ఎగ ఊపిరి వచ్చేది. వెంకటేశం క్లబ్బులో బేడకి రెండు పూరీలు ఇచ్చేవాడు. పొట్లం కట్టించుకుని రంయ్‌మని ఇంటికొచ్చి కూరతో తడిసిన పూరీలు తింటుంటే మజాగా ఉండేది.

– '' ఈ వెధవకి క్లబ్బులంటపడి తినడం ఇష్టం.... అదేం ప్రారబ్ధమో, అది ముచ్చట వీడికి'' అనేది అమ్మ.

''పోన్లేవే కుర్ర నాగన్న. మరో రెండేళ్లోస్తే వాడికే తెలుస్తుంది!'' అనేది దొడ్డమ్మ.

అటు తిరిగి చూశాడు. క్లబ్బుకి బదులు గాజుల దుకాణం వెలిసినట్టుంది అక్కడ. వెనుకనున్న మర్రిచెట్టు కళకళలాడుతూ ''నేనెప్పుడూ పచ్చగా ఇక్కడే ఉంటా'' అంటూ నిండుగా నిలబడి చిరుగాలికి మనసులో గీతం ఆలాపన చేస్తున్నట్టు కనపడింది.

అవధాని ఒక్కక్షణం ఆగాడు. అన్ని ఊళ్ళలాగే ఈ ఊరూ పెరిగిపోయింది. ఇప్పుడు జనాలకి ఉరుకులూ పరుగులూ.

వీధి మొదట ఇంటి కప్పు మీద మొక్కలు మొలచిపోయాయి. రోడ్డు ఎత్తయిపోయిందేమో ఇళ్ళు లోపలికి దిగబడిపోయాయి.

తమ ఇల్లు పెంకు జారిపోయింది. చూరు బల్ల ఎప్పుడు పోయిందో. జాలిగా, చీదరగా, తలదించుకున్నట్టుంది. గుమ్మంలోకొచ్చి తలదించుకున్నాడు.

''పెదనాన్నా!'' పొగలోకి కేకవేశాడు.

''ఎవరూ?'' అంటూ చిన్న బట్ట కట్టుకున్నావిడ తలుపు వారనుంచి అడిగింది.

''నేను వీరావధానిని !''

''రా నాయనా లోపలికి రా..... ఏమండీ ? బుజ్జిగాడు!'' దొడ్డమ్మ మాటలు వింటుంటే గుండెల్లో ఆనందం నిండిపోతున్నట్టుంది.

– ''చంటివాడు లేవో! అల్లరి వాళ్లు చెయ్యక మనం చేస్తామా? వాడి మీద చెయ్యి చేసుకుంటే నా మీద ఒట్టే !!'' దొడ్డమ్మ వాటేసుకునేది అమ్మ కొడుతూ ఉంటే.

'' ఏమండోయ్! రండి ఇలా.... మీ పెదనాన్నకెప్పుడూ మొక్కలూ, మొల్లూ, అవే ప్రాణం.....''

దీక్షితులుగారు గావంచాకి చెయ్యి తుడుచుకుంటూ వచ్చారు.

'' ఒరే బుజ్జిగాడివా ? ఎన్నాళ్లకి కంటపడ్డావ్.... అంతా కులాసా?''

'' ఆఁ!''

''కాళ్లు కడుక్కో! కాఫీ తెస్తా!''

పొగ ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా పెట్టె బల్లమీద ఉంచి పెరట్లోకి వెళ్లాడు అవధాని.

ఎక్కడికో వచ్చినట్టుంది. ఎదురుగా ఎత్తయిన గోడ విశాలమయిన పెరడేమయిపోయింది ?

గోడ వెనుకే పెద్ద సిమ్మెంటు మేడ.

''పిల్లలూ వాళ్లూ కులాసా? అమ్మనీ, కోడలినీ, పిల్లలినీ తీసుకరాలేకపోయావా ?'' కాఫీ గ్లాసు అందిస్తూ అడిగింది దొడ్డమ్మ.

''దూరా భారం కదు దొడ్డమ్మా, ఎన్నాళ్ళ నుంచో అనుకుంటుంటే ఇప్పటికి వీలయింది !''

''పిల్లవాళ్లేం చేస్తున్నార్రా అబ్బీ!'' దీక్షితులుగారు అడిగారు.

''పెద్దవాడు ఇంజనీరింగు అయిపోయింది. అమ్మాయి బియ్యే ఈ సంవత్సరంతో ఆఖరు... మరి మనవాళ్లు...?

'' ఏం చెప్పమంటావ్! ఎవరి ఖర్మకు ఎవరు కర్తలు ? దౌర్భాగ్యం ఏమిటో, లేకలేక పుట్టిన నా కొడుకు ప్రయోజకుడు కాలేదు. వాడి సంగతి మరి అడక్కు... నిన్ను చూసి నా విచారం మటుమాయమైపోయింది. వంశోద్ధారకుడివి నువ్వే. ఇన్నేళ్లొచ్చి కుటుంబానికి నేనేమీ నిర్వాకం చేయలేకపోయాను. పెరడంతా అమ్మవలసి వచ్చింది. వాళ్లు చెట్లు కొట్టేసి ఇల్లు కట్టుకున్నారు. ఒక్కొక్క చెట్లు కొడుతూ ఉంటే నా కాళ్లూ, చేతులూ నరికేస్తున్నట్టనిపించింది... చెల్లి అత్తారింట్లో ఉంది. దానికి ఇద్దరు పిల్లలు. దాని పెళ్లికేగా మనమంతా తిరుపతిలో కలిశాం... సంతోషం నలుగురితో పంచుకోవడమే నాకు తెలుసు... నీ బాధ్యతలు నీకున్నాయి. ఎంత చెట్టుకి అంత గాలి. నిన్ను అడగడానికి నోరు రాలేదు. మీ అమ్మ అనుమతయినా తీసుకోకుండా పెరడు పొలం పడమటి భాగం ముక్కలుముక్కలు చేసి పబ్బం గడుపుకున్నాను !''

దీక్షితులుగారు నిట్టూర్చారు.

''వేన్నీళ్లు పెట్టా ! స్నానం చేస్తావా ?'' అన్నపూర్ణమ్మ అడిగింది.

''నూతి దగ్గర పోసేసుకుంటాలే !''

స్నానం చేసి అవధాని దొడ్డమ్మ ఇచ్చిన మడిపంచ కట్టుకుని సంధ్య వార్చడం అయిపోయాక గోడకి జేరగిలబడి అడిగాడు ''దొడ్డా ! తమ్ముడు ...?''

'' ఈ ఊర్లోనే అద్దె ఇంట్లో ఉంటున్నాడు. తండ్రికీ కొడుక్కీ పడదు. వాడు ఇక్కడికి రాడు. వాడింటికే ఎప్పుడొస్తాడో, ఎప్పుడు వెడతాడో కోడలికే తెలియదు. లేక లేక పుట్టాడు. మురిసిపోయాను... కాని వాడి కడుపున ఒక కాయ కాయలేదు. డబ్బు బాధ దేవుడు దయవలన నాకు ఎప్పుడూ లేదు.''

అన్నపూర్ణమ్మ కన్నీళ్లు నింపుకంది.

'' ఊరుకో దొడ్డా ! మంచివాళ్లకి అన్నీ మంచిగానే జరుగుతాయి. గ్రహచారం బాగులేక పెద్ద పెద్దవాళ్ళు కష్టాలు పడ్డారు. మనం ఎవరికంటే గొప్ప? ... నేను వెళ్లి తమ్ముడిని చూసి వస్తా... మేమయితే పెద్దనాన్న ముందు పడడానికే భయపడి వణికిపోయేవాళ్లం ... ఆ దర్జా, ఆ హోదా... నాన్న పోయినందుకు మీరుండబట్టి కాని మేం ఏమయిపోయేవాళ్లం ? అమ్మా నేనూ మిమ్మల్ని తలచుకోని రోజుండదు. అంతా మీ ఆశీర్వాదమే అంటుంది అమ్మ. ఈ మధ్య మునుకులు పట్లూ అవీ ! 'వయసయిపోయిందిరా !' అంటుంది అమ్మ''.

''అదేమిట్రా నాకంటే పదేళ్లు చిన్నది... దానికి చిన్నతనంలోనే భగవంతుడు అలా చేశాడు.' అన్నపూర్ణమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంది.

''దొడ్డమ్మా, పెదనాన్న ఏరీ ?''

'' ఎక్కడికెళతార్రా ... పొలానికని వెళతారు ... ఏం పొలమో ఏమో ! చాప చిరిగి చదరంతయింది. అలాగే కాలక్షేపం చేస్తున్నాం... మెంతి వంకాయ ఇష్టమనేవాడివి... చేస్తున్నా !''

పన్నెండు అవుతుంటే దీక్షితులుగారొచ్చారు.

'' ఎన్నాళ్లయిందోన్రా అబ్బీ! ఇల్లు ఇన్నాళ్లకి మళ్లీ కళకళలాడుతోంది... ఓయ్ నే కాళ్లు కడుక్కుని వస్తా, వడ్డించు !''

భోజనాలంతసేపూ ఆ మాటా, ఈ మాటా చెబుతూనే ఉన్నా చేతులు కడుక్కున్న తరువాత దీక్షితులుగారి ముఖం గంభీరమైపోయింది.

''చిన్నవాడివి. తమ్ముడి కొడుకువి. నా కళ్లముందు పుట్టినవాడివి... నా బాధ్యత నేను నెరవేర్చడం ధర్మం... దొడ్డ మనసు మనిషివి. చిన్నవాడివి. నిన్ను పొగడకూడదనుకో... ఉమ్మడి కుటుంబం. ఎన్నేళ్ల నుంచో మీకు నేనేమీ ఇవ్వడం లేదు. ఆస్తిలో నీ వాటా నీకివ్వాల్సిన బాధ్యత నాకుంది. నువ్వడిగినా అడగకపోయినా సరే !''

''పెదనాన్నా !'' అవధాని గొంతు జీరబోయింది.

''మీరు నన్ను ఎంత గారంగా చూశారో ఆ కానుగచెట్టూ, ఆ నేరేడు చెట్టూ, ఆ జామచెట్టూ కళ్లారా చూశాయి. అవి లేవుకాని నేనున్నాను. పిల్లల్ని చుట్టూ కూచోబెట్టుకుని పెరుగూ బువ్వా చేతిలో ముద్దలు పెడుతూ ఉంటే దూరంగా నిలబడి తలలూప్తుతూ ఉండేవి ఆ చెట్లు. పచ్చగా, ఎత్తుగా, గుబురుగా ఉన్న చెట్టుని చూస్తే నాకు దొడ్డమ్మే గుర్తుకొస్తుంటుంది ఎక్కడున్నాసరే. పెరట్లో చెట్లు పోయాయని నేను గుడ్లనీరు కుక్కుకుంటూ ఉంటే నాకు ఆస్తి మనసులో మెదులుతోందనుకుంటున్నారు. ఆస్తి అడగడానికి వచ్చాననుకుంటున్నారు..... దొడ్డమ్మా నువ్ చెప్పు! మనిషికి డబ్బు ఎంతవరకూ అవసరం ? అది నిజంగా మనల్ని ఎంతో దూరం తీసుకెళ్లగలదంటావా? నిజానికి సంపాదనే గొప్పనుకుంటే ఎవరితో పోటీ చేయగలం, ఎంతవరకూ చెయ్యగలం ? చేసి ప్రయోజనం ఏముంది ?''

అన్నపూర్ణమ్మ లేచి వచ్చి చంటాడిని నిమిరినట్టు అవధాని కళ్లు తుడిచి శిరసు నిమిరింది.

''అది కాదురా, నే ముందే చెప్పాగా !.... నీ చేత చెప్పించుకునే స్థితికి దిగజారలేనురా !.... వంశవృక్షం చివరికి కుక్కమూతి పిందె వేసిందని క్రుంగిపోతున్నాను. లేక లేక పుట్టిన కొడుకు వంశోద్ధారకుడవుతాడనుకున్నాను.... వాడు డబ్బు సంపాదించలేదని నాకు విచారం లేదు. చదువు అబ్బలేదనీ బాధపడలేదు... నిజానికి నేను వంశానికి చేసిన నిర్వాకం ఏముంది ? ఉన్నదే నిలబెట్టలేకపోయాను... అందుకూ విచారంలేదు. కలిమిలేములు కావడి కుండలు... నాతో పోట్లాడి ఆస్తి వాటా అంటూ మడి చెక్క రాయించుకుని అమ్మేశాడు. ముఖం చూపించలేక ఇల్లు వదలి వెళ్లిపోయాడు. కుక్కమూతి పిందెకు అంతకంటే ఏం చేతనయి చస్తుంది ?''

''నువ్ మనసుకష్టపెట్టుకోకు పెదనాన్నా.... దొడ్డమ్మ అంతా చెప్పింది.... నేను....''

''అది సరేలేవోయ్ ! వాడు మూర్ఖుడు. వాడి మనసు రంజింపచెయ్యడం అవివేకం. నీకు రావాల్సిన ఆస్తి ఆ పొలంలోనే ఇద్దామని నా అభిమతం.... నాకు వారసుడివి నువ్వే.... కాగితం రాయించి తీసుకొచ్చా!''

'' ఎంతపని చేశారు పెదనాన్నా ! నాకు అన్నం పెట్టి చెయ్యి కడిగిన దొడ్డమ్మనీ, మిమ్మల్నీ చూడాలనీ, మీ ఆశీస్సులు పొందాలనీ... అంతదూరంలో ఉండి మీకు ఏమీ చెయ్యలేకపోయాను. ఆస్తి ఊసు మరితేకండి ! నన్ను అపార్థం చేసుకోకండి !''

''అపార్థం ఏమిట్రా వెర్రినాగన్నా!... రోజులు ఎలా మారిపోయాయో తెలుసుకోలేదను కుంటున్నావా? మాతాపుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః అని ఊరకే అన్నారా ? .... చిన్న దాని పెళ్లికోసం పెరడు అమ్మేశాను. మనందరినీ తమ చేతులతో కాపాడుతున్న వృక్షాలన్నీ నేలకొరిగాయి.... కూచున్న కొమ్మను సైతం నరుక్కున్నాను.... మేం ఉండడానికి ఈ కొంప చాలు.... ఇక ఎక్కడికిపోతాం ? పోగలం ? ఇవి చేతులు కావు......''

''పెదనాన్నా !.... మీరు మనసు కష్టపెట్టుకున్నారు ఇలా అని తెలిస్తే రాకపోయేవాణ్ణి.....''

'' ఎందుకండీ మీ మనసు కష్ట పెట్టుకుని వాడినీ హింసిస్తారు... వాడు అడగనిదే....''

''వాడు అడగడు.... అలాగని మనం ఇవ్వడం మానేస్తామా ?... వాడు మనబిడ్డలా కాదు. కాని మన గౌరవం......''

దీక్షితులు గారి ముఖం చూచి అవధాని పెరట్లోకి వెళ్లిపోయాడు.

అతను తిరిగి వచ్చేసరికి ఆయన ఇంకా మాటాడుతూనే ఉన్నారు.... ''కాలక్షేపం బహుభేషుగ్గా జరుగుతోంది... నా కొడుకులాంటి మూర్ఖుల్ని పెంచడం కంటె చెట్లు పెంచడం మహోత్కృష్టమైనదని గ్రహించాను. రకరకాల మొక్కలు పెంచి వాటిని అమ్ముకుని పొట్ట పోసుకుని విశ్వశ్రేయానికి నాకు చేతనయిన కృషి చేస్తున్నాను. అబ్బీ ! మన పేరు మారిపోయింది తెలుసా..... దీక్షితులు గారంటే ఎవరికీ తెలియదు – మొక్కల పంతులు గారను చంటి పిల్లాడు కూడా చెప్పేస్తాడు.....''

వీరావధానికి కళ్లవెంట నీళ్లు బొటబొటా కారిపోయాయి.

''మీరు వెళ్లి పడుకోండి !'' అంటూ అన్నపూర్ణమ్మ భర్తను లోపలికి పంపించేసింది.

''దొడ్డా, పెద్దనాన్నలో చాలా మార్పు వచ్చింది సుమా.... అంతసేపు ఎదురుగా కూచుని ఎలా మాటాడానో, నాకే ఆశ్చర్యంగా ఉంది... నాకు ఫలసాయం ఆస్తి హక్కు ఇవ్వలేదంటారేమిటీ.... కాలేజీలో నేను చదువుకోడం ఎలా చదువుకున్నానూ ? నాకోసం ఎంత ఖర్చు చేశారు ? అవి నేను మరిచిపోయాననుకున్నారా ? కుటుంబంలో మొట్టమొదట కాలేజీలో చదువుతున్నానని – తండ్రిలేని బిడ్డననీ..... నా ఎడల మీరు చూపించిన ఆదరమూ, అనురాగమూ నేను మరిచిపోగలనా ? మరిచి పోతే నాకు పుట్టగతులుంటాయా ?..... దొడ్డా అమ్మ నీతో ఒక్కమాట చెప్పమంది. ఈ వయసులో మీరిద్దరూ ఇక్కడ ఒంటరిగా ఉండడం ఎందుకు ? నాతో వచ్చెయ్యండి !''

''పిలిచావ్ రా నాన్నా ! అదే సంతోషం... నాకయితే ఏ అభ్యంతరమూ లేదు. ఆయన సంగతి నీకు బాగా తెలియదు. రెండు రోజులు ఆగి ఆ మాట ఆయనతో అను. ఆయన అవునని నేను రాకపోతే నీ మీద ఒట్టే !''

దొడ్డమ్మ అలా ఎందుకందో అవధానికి అంతుపట్టలేదు.

సాయంకాలం పొలానికని ఇద్దరూ బయలుదేరారు.

'' ఆభాగం అమ్మేశాను.... ఇదీ మన భాగం ......'' దీక్షితులుగారు అవధానికి చూపించారు.

' ఇక్కడ ఏం పండుతుందీ' అన్న ప్రశ్న బయటకు రాబోతూ ఉంటే పెదిమల మధ్య బిగపట్టేశాడు.

పొలం పొలంలా లేదు. తోటలా ఉంది. మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు, నేరేడు చెట్లు - జామచెట్లు.

-''ఢిల్లీ శివార్లలో పాతికవేలిస్తే ఎకరం తోట వేస్తారు. ఆరేళ్ల తరువాత తోట మనదేనట. మనం అమ్ముకోవచ్చు మనం అమ్మాలనుకుంటే వాళ్లే తోట నరుక్కుని యాభై వేలిస్తారు.... మీతో చెబుదామని వచ్చాను.''

''చెట్లు నరకడం సులువు. పెంచడం కష్టం.... మూడెకరాల మామిడి తోట చేజేతులా అమ్మేశాను. వాళ్లయినా ఉంచుకున్నారా - బొగ్గులు చేసి అమ్మేశారు. చెట్టు పెరిగి కాయ కాయడానికి ఎన్నాళ్లు పడుతుంది! ఒక్కరోజులో కాల్చి పారేస్తాం.... చెట్లు నరకడం వల్లనే దేశం ఇలా తగులబడిపోయింది. నా మాటలు వెర్రివాడి మాటలంటే నేనేం చెయ్యను ?''

మరేం మాటాడకుండా ఇద్దరూ ఇంటికి వచ్చేశారు.

మరుసటి రోజు ఉదయాన్నే అవధాని బాల్య మిత్రుడు కృష్ణయ్య నాయుడి దగ్గరకెళ్లాడు.

'' ఓరి నువ్వా ! వీరావధానివి కదూ ! ఢిల్లీలో స్థిరపడి పోయావన్నారు...... ఎన్నాళ్లకి కలిశాంరా!'' అంటూ క్రిష్ణయ్య ఆదరంగా పలకరించాడు.

''బావున్నావా ! పిల్లా మేకా.... అంతా కులాసా !''

చిన్నతనం కబుర్లు కలబోసుకుంటూ రెండు గంటలు గడిపేశారు బాల్యమిత్రులిద్దరూ.

'' ఒరేయ్ ! నువ్వో ఉపకారం చెయ్యాలి.... ఆస్తిలో నా వాటా పెదనాన్న కిచ్చేస్తూ కాగితం రాసేయ్ ! లాయరువు కదా, నీకు అన్నీ తెలుస్తాయి....''

''అదెంతపని..... నీ పిల్లలు....''

''వాళ్లకి ఇక్కడికి రావాలని ఉండదు.... రారు.... పెదనాన్నకి ఈ ఆస్తే ఆధరవు. నీకు తెలుసు కదా !''

కృష్ణయ్య మారు మాటాడకుండా కాగితం తయారు చేశాడు.

'' ఎలా ఉంది ఈ ఊర్లో భూమిధర... పడమట భూమి పెదనాన్న ఎవరికో అమ్మేశాడట....

'' ఏముందిలెద్దూ. భూములుంటే ఏం లాభం ? మనవాళ్లు పండించడం సుమారు అసాధ్యం... నీలాంటివాళ్లెవరూ భూమి కొనలేరు. కొనరు. కొన్నా ప్రయోజనం లేదు. ఉన్నమాట అది.''

-అక్కడ నుంచి నేరుగా అవధాని తమ్ముడు సుబ్బావధాని ఇంటికి వెళ్లాడు..

''నిద్రపోతున్నారు !'' అంది ఇల్లాలు.

''నా పేరు వీరావధాని.... ఢిల్లీ నుంచి వచ్చాను....'' ఆవిడ లోపలకు వెళ్లి భర్తను లేపి తీసుకొచ్చింది.

'' ఏంరా బావున్నారా అంతా !''

'' ఆఁ ! నాన్న మాటలు నమ్మకు. ఆయనకు అదోలాంటి వెర్రి పట్టుకుంది. ఇప్పుడే కాదు - సుమారు ఆరేళ్లయింది. మొక్కలు పెంచడం, నారు అమ్మడం... చెట్లు పెంచటం ఇలాంటి కబుర్లేవో చెబుతున్నారాయన...... ఎన్ని మొక్కలు అమ్మితే జీవితం గడుస్తుంది చెప్పు. చదువంటే నాకు అబ్బలేదు. లారీ నడపడం నేర్చుకున్నా..... మెల్లగా కష్టపడి ఓ అర్ధణా వాటా కూడా సంపాయించా... నా వాటా తీసుకుని అమ్మిపారేశా.... అది నాన్నగారికి నచ్చలేదు...... నాకు చేతనయింది ఇంటికి పెడుతూనే ఉన్నా.... నన్ను చూస్తే నాన్న గారికి విపరీతమైన అసహ్యం ఏర్పడిపోయింది. అక్కడికి

వెళ్లడం మానేశాను...... అమ్మే వచ్చి చూసి పోతూ ఉంటుంది. నా కడుపున ఓ కాయ కాయలేదని అమ్మ బెంగ..... మన చేతిలో ఉందా ?..... ఇంతకీ బిడ్డను పెంచడం – అందునా ఈ రోజుల్లో – బడిలో చేర్పడమే కష్టం.... నాకు ఆ విచారం లేదు... అమ్మ ఏమయినా చెప్పిందా ?''

''లేదులే....'' అవధానికి ఏమనాలో తోచలేదు.

''అమ్మకి విషయమంతా తెలుసు. ఆయన మొండి మనిషి. ఆయన మాటలు వింటే నేనే ఏదో ద్రోహం చేశానని నమ్మేస్తావు.... వ్యవసాయం చేసే స్థితి దాటిపోయింది. ముక్కలు ముక్కలు చేసి ఆస్తి అంతా కర్పూరం అయిపోయి, హరించుకుపోయింది. మొక్కలంటూ పెంచారు. బేరాలు లేక వృక్షాలయిపోయాయి. నేరేడు చెట్లు, రావి చెట్లు ఎందుకు పనికి వస్తాయి చెప్పు ! ఎవరి వెర్రి వాళ్లకి ఆనందం.....'' సుబ్బావధాని ముఖం ఎర్రగా అయిపోయింది.

''పోన్లెద్దూ ! పెద్దాయన..... మనమే పదిమంది ఉన్నాం కనక !.... అయన మనసు మనకు తెలుసు. మనం అన్నదమ్ములం. నేనూ మరో నాలుగేళ్లలో పించనీ పుచ్చుకుంటున్నా.... పిల్లల సంగతి మనం చెప్పలేం..... ఉన్న ఊరూ, కన్న తల్లీ అన్నారు..... ఇక్కడో ఇంత భూమి కొనాలనీ, ఇల్లు బాగుచేయించాలనీ ఆశ..... పెద్ద నాన్న ఋణం నేను తీర్చుకోలేనురా..... నువ్వేమేనా అను... ఆయన మనసు మంచిది.''

''సంతోషం. కాని వ్యవసాయం నీవల్లవుతుందంటావా ?''

''అదే ఆలోచిస్తున్నాను.''

'' ఆలోచించు.... కాని నాన్న మాటలు నమ్మకు.... నాన్నగారికి పిచ్చి ముదురుతోంది. రోజుకి పది రూపాయల కూలికి మొక్కలు నాటే ఉద్యోగంలో చేరాలని అనుకుంటున్నారని అమ్మ చెప్పింది......''

వీరావధానికి చెమటలు పట్టేశాయి. ఇంటికి రాగానే ''దొడ్డమ్మ పెదనాన్న ఏరీ ?'' అని అడిగాడు. పెరట్లో గోతులు తవ్వుతుంటేయన వంక తదేకంగా చూశాడు.

''మన పొలం – అదేతోట – పక్క ఉన్న భూములు ఎవరివి ?''

''శివరామకృష్ణుడి తమ్ముడి కొడుకు కృష్ణయ్యది.... ఏం ?''

''అది కొంటే?''

''భేషుగ్గా ఉంటుంది.....''

పావు గంటలో కృష్ణయ్య దగ్గరకు వెళ్లాడు అవధాని......

'' ఏం రా ! మరేమయినా ఆలోచన వచ్చిందా ? రిజిష్టర్ చేయించలేదుగా.... ఫరవాలేదులే....''

''అది కాదురా... మా పొలం పక్కనున్న భూమి......''

'' ఉత్త బంజరు... నాదే ..... సీలింగులోకి రాకుండా అమ్మేద్దామనే అనుకుంటున్నా.... ఎవడు కొంటాడులే....''

''అది కాదురా, నేను కొందామని.....

''నిన్ను చూజూస్తూ నేను..... పనికి రాదురా బాబూ !''

''అసలు ఎంత వస్తే ఇద్దామనుకుంటున్నావ్ ?''

'' ఏడు వేలు వస్తే గొప్ప.... నీకయితే ఆరువేలకే ఇస్తా !''

''రేపే రిజిస్టరీ చేయించుకుంటా !'' వీరావధాని లేచి వెళ్ళిపోయాడు.

కృష్ణయ్య ఆశ్చర్యంగా చూశాడు.

నాలుగు రోజుల తరువాత బయలుదేరుతూ అన్నాడు అవధాని : ''పెదనాన్నా ! ఇవిగో కాగితాలు.... రెండెకరాలు కొన్నా.... భూమి కాస్త బాగు చేయించి సరుగుడు తోట వెయ్యండి. మీ పేరనే రాయించా... ఇదిగో ఖర్చులకి డబ్బు...... దొడ్డమ్మ, నీ ఆశీర్వచనం.'' అంటూ ఇద్దరి కాళ్లకూ వంగి నమస్కరించాడు.

''సరే వృక్ష వంశానికి అంకురార్పణ చేస్తా !'' అంటూ మిలమిల మెరుస్తున్న కళ్లతో ''చిరంజీవ - శతాయుష్షు !'' అంటూ దీవించారు దంపతులు.

కనుకొలకుల్లో నీళ్లు నింపుకున్నాడు అవధాని.

**ఆంధ్ర సచిత్ర వారపత్రిక**

27 మార్చి – 2 ఏప్రిల్, 1987.